ప్రజాశక్తి

సోమవారం 13 ఫిబ్రవరి 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

గొంతెండాల్సిందేనా?

- తాగునీటి ఎద్దడిపై ఖరారు కాని ప్రణాళిక
- పెరుగుతున్న ఎండల తీవ్రత
- కార్యరూపం దాల్చని వాటర్ గ్రిడ్
- జలజీవన్ మిషన్ పనులు మందగమనం



పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం గండిగనుమలలో బోరు మోటారు ట్యాంక్ వద్ద నీటి కోసం తిప్పలు

ప్రజాశక్తి -గుంటూరు జిల్లా ప్రతినిధి

చలి తీవ్రత తగ్గి వేసవి సీజన్ ప్రారంభమైంది. పలు గ్రామాల్లో తాగునీటి సమస్య పొంచి ఉంది. పెండింగ్‌లో ఉన్న పథకాలను పూర్తి చేసేందుకు నిధుల సమస్య వెంటాడుతోంది. ప్రతి ఇంటికి కుళాయి కనెక్షను ఇవ్వాలనే లక్ష్యంగా చేపట్టిన జలజీవన్‌మిషన్ కార్యక్రమం మందగమనంగా సాగుతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.433 కోట్లతో 1580 గ్రామాల్లో 5,79,156 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చే లక్ష్యంతో చేపట్టిన ఈ పథకం ఆశించిన స్థాయిలో పురోగతి లేదు. లక్ష్యం సాధనకు 2024 వరకు అవకాశం ఉన్నా ఇప్పటి వరకు 70 శాతం గ్రామాలు కూడా పూర్తి కాలేదు. ఈ నేపథ్యంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న గ్రామాల్లో తక్షణం చేపట్టాల్సిన పనులింకా కొలిక్కి రాలేదు.

పల్నాడు ప్రాంతంలో తీవ్రంగా ఉన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు ప్రతిపాదించిన వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు పనులు ఇంకా ప్రారంభం కాలేదు. గుంటూరు, పల్నాడు జిల్లాలోని 9 నియోజకవర్గాల పరిధిలో 450 గ్రామాలకు రక్షిత తాగునీటి వసతి కల్పించేందుకు రూ.2665 కోట్ల అంచనాలతో పరిపాలన ఆమోదంతో ఉత్తర్వులు ఇచ్చినా ఒక్క నియోజకవర్గంలో కూడా పనులు ప్రారంభం కాలేదు. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు అమలులో భాగంగా నరసరావుపేట పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలకు, గుంటూరు పార్లమెంటు పరిధిలో తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గాలకు కలిపి ఈ పనులను చేపట్టాలని నిర్ణయించారు. నాగార్జున సాగర్ నుంచి బుగ్గవాగు ద్వారా తొమ్మిది అసెంబ్లీ నియోజకవర్గాలకు తాగునీటిని అందజేసేలా డిపిఆర్ తయారు చేశారు. ఈ ఉత్తర్వులు కాగితాలకే పరిమితమయ్యాయి.

ప్రతి మనిషికి గ్రామీణ ప్రాంతాల్లో రోజుకి 100 లీటర్లు, పట్టణ ప్రాంతాల్లో రోజుకి 135 లీటర్లు సరఫరా చేసేలా మార్గదర్శకాలు రూపొందించారు. వినుకొండ నియోజకవర్గం పరిధిలో పలు గ్రామాల్లో ఫ్లోరైడ్ సమస్య తీవ్రంగా ఉంది. రక్షితనీటి పథకాలు నిర్వహణలో గ్రామపంచాయతీల అలసత్వం వల్ల తరచూ మరమ్మతులకు గురై సకాలంలో తాగునీరు లభించడం లేదు. కృష్ణానదికి సమీపంలో ఉన్న గ్రామాల్లోనూ నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. రాజధాని గ్రామాల్లో ఇప్పటికీ పూర్తి

2లో

ఎస్టీ మహిళను కట్టేసి.. ఇల్లు కూల్చేసి..

- రౌడీ మూకలను తెచ్చి వైసిపి నాయకుల దుశ్చర్య
- ఇక్కుర్రులో దారుణం - నమోదవ్వని కేసు

ప్రజాశక్తి - నరసరావుపేట

దళిత మహిళను వైసిపి నాయకులు, రౌడీ మూకలు కలిసి కట్టేసి ఆమె కళ్లముందే ఇంటిని కూల్చి వేసిన దారుణ ఘటన మండలంలోని ఇక్కుర్రులో చోటుచేసుకుంది. ఆదివారం వెలుగు చూసిన ఘటనపై స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎస్టీ ఎరుకుల సామాజిక తరగతికి చెందిన రాచమల్లు వాసు గతంలో వాలంటీర్‌గా పని చేసేవాడు. వాసు తాత 30 ఏళ్ల కిందట స్థానికుడైన వ్యక్తి వద్ద స్థలాన్ని కొనుగోలు చేశాడు. అప్పటి నుండి అక్కడే వారి కుటుంబం నివాసం ఉంటోంది. తదనంతరం ఆ స్థలం వాసు తండ్రికి, ఆయన మరణానంతరం వాసుకు స్థలం సంక్రమించింది. ఈ క్రమంలో పదేళ్ల కిందట వాసు ఆ స్థలంలో రేకుల షెడ్డు వేసుకున్నాడు. అక్కడే తన తల్లి, భార్యాబిడ్డలతో కలిసి ఉంటున్నాడు. అయితే వాసు తాతా గతంలో తమ వద్ద రూ.1600 తీసుకున్నాడని, దానికి ప్రతిగా ఇప్పుడున్న స్థలాన్ని ఖాళీ చేయాలని వైసిపికి చెందిన కొందరు నాయకులు ఒత్తిడి చేయడం, వేధించడం మొదలు పెట్టారు. ఇందుకు వాసు నిరాకరించడంతో అతనిపై తరచూ వివాదాలకు దిగుతున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఆ ఇంటికి విద్యుత్ కనెక్షన్‌ను కూడా తీయించారు. దీనిపై వాసు ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించడంతో కమిషన్ ఆదేశాలతో విద్యుత్ శాఖ కనెక్షన్‌ను పునరుద్ధరించింది.



ఇల్లు కూల్చేసిన స్థలంలో వాసు తల్లి

అయినా ఊరుకోని నాయకులు వాసును వేధిస్తూనే ఉన్నారు. అందులో భాగంగా ద్విచక్ర వాహన చోరీ నేరాన్నీ వాసుపై మోపి కేసు పెట్టారు. వాసును

2లో



ఓవరాల్ ఛాంపియన్ విన్నర్స్‌ను అభినందిస్తున్న వై.వి.ఆంజనేయులు, కెఎస్ లక్ష్మణరావు తదితరులు

సృజనాత్మకతకు అవధుల్లేవు

బాలోత్సవం ముగింపులో వక్తలు - వేలాదిగా పాల్గొన్న బాల, బాలికలు

ప్రజాశక్తి-గుంటూరు

నేటి తరం విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలకు కొదవే లేదని, చదువుతోపాటు, కళలు, ఆటలు, సాహిత్య రంగాల్లో ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని, అప్పుడే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని వక్తలు అన్నారు. స్థానిక లక్ష్మీపురం, పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో రెండ్రోజులపాటు నిర్వహించిన గుంటూరు బాలోత్సవం ఆదివారం ఘనంగా ముగిసింది. 23 అంశాల్లో నిర్వహించిన పోటీల్లో సుమారు ఐదువేల మంది పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. రెండోరోజు కార్యక్రమాలను విజ్ఞాన్స్ అధినేత డాక్టర్ లావు రత్తయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముగింపు కార్యక్రమంలో చలపతి విద్యా సంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు హాజరై విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

గుంటూరు బాలోత్సవం అధ్యక్షులు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన రెండోరోజు ప్రారంభ సభలో లావు రత్తయ్య మాట్లాడుతూ పాఠశాలల భవనాలకు రంగులేసి, బెంచీలు ఏర్పాటు చేసినంత మాత్రాన నాణ్యమైన విద్య అందదని, ఉపాధ్యాయ సాధికారత దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, అందుకు తగిన శిక్షణ అందించాలని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అవగాహన శక్తి అధికమని, ప్రస్తుత సివిల్

2లో

అట్టహాసంగా బిపి మండల్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

బిపి మండల్ విగ్రహాన్ని ఆవిష్కరణ గుంటూరు-అమరావతి రోడ్డులో ఆదివారం అట్టహాసంగా జరిగింది. పెద్ద సంఖ్యలో బిసి సంఘాల నాయకులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులే హాజరవగా విగ్రహాన్ని ద్రవిడ కళగం పార్టీ అధ్యక్షులు కె.వీరమణి బిపి మండల్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఇంత పెద్దసంఖ్యలో నాయకులు హాజరువడం ఇటీవల కాలంలో ఎప్పుడూ లేదు. విగ్రహావిష్కరణ తర్వాత రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అధ్యక్షతన బిసి ఆత్మగౌరవ సభ నిర్వహించగా జిల్లా నలుమూలల నుంచి బిసి సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. త్వరలో చేపట్టనున్న జనాభా గణనలో బిసిల గణన పూర్తిస్థాయిలో జరగాలని సభలో పాల్గొన్న వక్తలు పిలుపునిచ్చారు. రాజ్యాంగం ప్రకారం బిసిలకు దక్కాల్సిన

2లో



వేదికపై అభివాదం చేస్తున్న నాయకులు



మాట్లాడుతున్న పెనుకొండ లక్ష్మీనారాయణ

భావప్రకటనా స్వేచ్ఛను పరిరక్షించుకోవాలి

- అరసం రాష్ట్ర మహాసభ పిలుపు
- రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, వల్లూరు శివప్రసాద్
- దేశంలో సైలెంట్ ఎమర్జెన్సీ : వినీత్ తివారి

సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులు

- 'గడపగడపకు' వచ్చిన విజ్ఞాపనలకు ప్రాధాన్యం
- ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల కేటాయింపు
- ప్రజాశక్తితో సిపిఒ శేషశ్రీ

ఇంటర్వ్యూ 5లో

గురుకుల పాఠశాలలో కలెక్టర్ తనిఖీ

- సదుపాయాలు, కుటుంబ పరిస్థితులపై ఆరా
- విద్యార్థినులతో కలిసి భోజనం

2 లో

వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్‌గా లోకేష్



ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్
వైసీపీ మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా పెదనంది పాడుకు చెందిన చీమకుర్తి లోకేష్, కో కన్వీనర్లుగా స్వర్ణ రమేష్ బాబు, చెన్నుపాటి సురేష్ బాబు నియమితులయ్యారని వారు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ ఖాసిం, గద్దె హరిబాబు, ఎస్ఎస్ యూత్ సభ్యులు దాసరి గోవిం దు, మేడిద శాంతిబాబు లోకేష్‌కు అభినందనలు తెలిపారు.

ఘంటసాల స్వరం.. తెలుగుజాతికి వరం

ప్రజాశక్తి-గుంటూరు
ప్రజల హృదయాల్లో కొలువై ఉన్న అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అని అవగాహన సంస్థ సభ్యులు కొనియాడారు. స్థానిక అరండల్‌పేటలోని కుబేరాటవర్స్‌లో ఉన్న అవగాహన కార్యాలయంలో ఆదివారం ఘంటసాల వర్థంతి కార్యక్రమాన్ని గాయనీగాయకులు నిర్వహించారు. ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి సంస్థ సభ్యులు నివాళలర్పించారు. ఘంటసాల స్వరం.. తెలుగు జాతికి లభించిన అపూర్వ వరం అని ప్రశంసించారు. ఈ సందర్భం గా ఘంటసాల పాటలను గాయనీగాయకులు రాజశేఖర్, డిటి సాయిబాబు, శివ రామయ్య, భాగ్యలక్ష్మి తదితరులు ఆలపించారు.కార్యక్రమంలో సీనియర్ గాయకుడు, ఇంజనీర్ ఘనశ్యామాచార్యులు, గాయకుడు, మేథావుల ఫోరం కన్వీనర్ పిఎస్‌మూర్తి తదితరులు ప్రసంగించారు.



డ్రమ్స్ వాయించి, రెండోరోజు కార్యక్రమాలను ప్రారంభించిన లావు రత్తయ్య

సృజనాత్మకతకు అవధుల్లేవు

(మొదటి పేజీ తరువాయి)

సర్వీసు అధికారులు, రాజకీయ నాయకులు, కంపెనీల యజమానులు ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారేనని చెప్పారు. ఇటీవల హైదరాబాద్ మహానగరంలో నిర్వహించిన ఒక సర్వేలో 70 శాతం మంది విద్యార్థులు మనకు ఆహారం, పాలు ఎక్కడి నుంచి వస్తున్నాయో చెప్పలేకపోయారన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు బోధనను ప్రాజెక్ట్‌ల రూపంలో, అనుభవ పూర్వకమైన విద్యను అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఇటువంటి బాలోత్సవాలు అన్ని పట్టణాల్లో నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలను పోటీలుగానే చూడకుండా, పాల్గొనటానికి, నైపుణ్యాలను ప్రదర్శించటానికి ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. రిటైర్డ్ అగ్రికల్చర్ సైంటిస్ట్ ఎన్.వేణుగోపాలరావు మాట్లాడుతూ జీవితంలో శాస్త్రీయ ధృక్పథం చాలా ముఖ్యమని, దీంతోపాటు ప్రశ్నించే తత్వాన్ని విద్యార్థులకు అలవాటు చేయాలని అన్నారు.

ముగింపు కార్యక్రమంలో వై.వి.ఆంజనేయులు మాట్లాడుతూ భావి భారత పౌరులైన విద్యార్థులు విద్యతోపాటు, కళలు, ఆటలు పాటల్లోనూ పాల్గొని సంపూర్ణ మూర్తిమత్వం సాధించాలన్నారు. ఆంధ్రా క్రైస్తవ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోజెస్ మాట్లాడుతూ బాలోత్సవం ఒక అద్భుతమైన కార్యక్రమమని పేర్కొన్నారు. జెవివి జాతీయ నాయకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ నుండి ప్రసాద్, బాలోత్సవం ప్రధాన కార్యదర్శి బి.ప్రసాద్, కన్వీనర్లు డాక్టర్ ఎం.బోసుబాబు, డాక్టర్ ఎ.సత్యనారాయణ ప్రసాద్, దుర్గాప్రసాద్, టిఆర్ రమేష్, వెంకట్రావు, జాన్‌బాబు, శంకర్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు. రెండ్రోజుల బాలోత్సవంలో సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ విద్యార్థులు సాధించారు. సీనియర్స్ విభాగంలో రన్నర్స్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ది సెంట్రల్ పబ్లిక్ స్కూల్, జూనియర్స్ విభాగంలో రన్నర్స్ వెంకటేశ్వర బాలకుటీర్ విద్యార్థులు సాధించారు. వీరికి అతిథులు బహుమతి ప్రదానం చేశారు. ప్రతి ఈవెంట్‌లో గెలుపొందిన వారికి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందచేశారు.





సందడిగా పుస్తక మహోత్సవం

నేడు పుస్తక ప్రియుల పాదయాత్ర

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన పుస్తక మహోత్సవం ఆదివారం పుస్తక ప్రియులు, సందర్శకులతో కళకళలాడింది. ఆదివారం కావడంతో పుస్తక మహోత్సవం ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. విద్యార్థులు, మహిళలు, చిన్నారులు ఎవరిక వారు తమకు కావాల్సిన పుస్తకాలు కోసం వివిధ స్టాల్స్‌ను సందర్శిస్తూ ఉల్లాసంగా గడిపారు. పుస్తక మహోత్సవంలో ఈసారి ఎక్కువగా చిన్న పిల్లలకు సంబంధించిన పుస్తకాలు ఎక్కువగా ఉండటంతో చిన్నారులు పుస్తక మహోత్సవంలో సరదాగా గడిపారు. అలాగే చిన్నారులకు సంబంధించి వివిధ పోటీలను నిర్వహించే ప్రతిభా వేదికపై వివిధ పోటీలు నిర్వహించడంతో అక్కడ కూడా చిన్నారులు ఎక్కువ సంఖ్యలో కనిపించారు. ఈ నెల 19వ తేదీ వరకు పుస్తక మహోత్సవం ఉంటుందని నిర్వాహకులు ప్రకటించారు.

నేడు పుస్తక ప్రియుల పాదయాత్ర

పుస్తక మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం పుస్తక ప్రియుల పాదయాత్ర జరుగనుంది. సాయంత్రం నాలుగు గంటలకు పుస్తక ప్రియుల పాదయాత్ర మొగల్‌రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియం వద్ద నుండి ప్రారంభమై బెంజిసర్కిల్ మీదుగా తిరిగి పుస్తక మహోత్సవం ప్రాంగణం వరకు జరుగుతుంది. ఈ పాదయాత్రను స్కూల్ ఎడ్యుకేషన్ కమీషనర్ సురేష్‌కుమార్ ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్.శిసోడియా పాల్గొంటారు. సాయంత్రం ఐదు గంటలకు పుస్తక మహోత్సవంలో జరిగే సభకు ముఖ్యఅతిథిగా మాజీ పార్లమెంట్ సభ్యులు ఉండవల్లి అరుణ్‌కుమార్ పాల్గొంటారు. అనంతరం అనువాద సాహిత్యంపై సదస్సుకు వక్తలుగా ప్రముఖ కవి సాహితీవేత్త వాడ్రేపు చినవీరభద్రుడు, నపాలపిట్ట ఎడిటర్ గుడిపాటి పాల్గొంటారు.





గురుకుల పాఠశాలలో కలెక్టర్ తనిఖీ

సదుపాయాలు, కుటుం పరిస్థితులపై ఆరా - విద్యార్థినులతో కలిసి భోజనం



ఆకస్మిక తనిఖీ చేస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

ప్రజాశక్తి- పిడుగురాళ్ల
పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గదిని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? అని వివరాలు సేకరించారు. ఆర్వో ప్లాంట్‌కు త్వరలోనే మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. అనంతరం పిల్లలతో కూర్చొని భోజనం చేస్తూ వారితో మాట్లాడారు. పాఠశాలలో క్విజ్ పోటీలు, ఇతర ఆటల పోటీలు నిర్వహిస్తున్నారా లేరా, వాటిల్లో విద్యార్థులు పాల్గొంటున్నారా లేదా అని విద్యార్థులను అడిగారు. పిల్లల కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలల్లో ఆత్మస్థైరం పెంపొందించే విధంగా పాఠాంశాలు భోదించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కొంతమంది విద్యార్థులతో పాఠ్య పుస్తకాలు చదివించారు. గురుకుల పాఠశాలకు ఎదురుగా ఉన్న బాలభవనంలో ఆసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని విద్యార్థులు చెప్పడంతో దాన్ని పరిశీలించారు. దీనిపై అధికారులు ఆదేశాలిస్తామన్నారు. ఇదిలా ఉండగా శోభకృత్ మిషన్ ప్రారంభించి పల్నాడు జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న పాత ఫైల్స్, పాత వస్తువులను మండల కేంద్రానికి తరలించి వేలం నిర్వహిస్తామని తెలియజేశారు. దీనివలన ప్రభుత్వ కార్యాలయాలు నూతనంగా ఉండటమే కాకుండా పాఠశాల గదులు కూడా ఖాళీ అయి తరగతి గదులు విశాలంగా ఉంటాయని చెప్పారు. పిడుగురాళ్ల ప్రాంతంలో ఏర్పాటు చేసిన అనధికార వెంచర్లపైనా చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ ఎంట ఎంపిడిఒ కాశయ్య, రెవెన్యూ అధికారులు ఉన్నారు.



వైసిపి నాయకులు రోడ్డుపై పడేసిన సామగ్రి

ఎస్టీ మహిళను కట్టేసి.. ఇల్లు కూల్చేసి..

(మొదటి పేజీ తరువాయి)

వాలంటీర్ విధుల నుండీ తప్పించారు. స్థలం స్వాధీనం అంశంపై వాసు కోర్టును ఆశ్రయించగా వాసుకే అనుకూలంగా కోర్టు ఆదేశాలిచ్చినట్లు తెలిందీ. మరోవైపు వాసుపై వైసిపి నాయకుల వేధింపులు, చంపుతామనీ బెదిరింపులు తగ్గగకపోవడంతో వీటిని తట్టుకోలేని వాసు తన భార్య సొంతూరైన అద్దంకికి వెళ్లాడు. అప్పటి నుండి వాసు తల్లి మాత్రమే ఇక్కుర్రులో నివాసం ఉంటోంది. ఈ నేపథ్యంలో స్థలం కోసం ఒత్తిడి చేస్తున్న వైసిపి నాయకులు, మరికొందరు రౌడీ మూకలు గ్రామంలో శనివారం రాత్రి కర్రలు తీసుకుని హల్‌చల్ చేసి స్థానికులను భయభ్రాంతులకు గురి చేశారు. వాసు తల్లిని ఇంట్లో నుండి బయటకు నెట్టేయడంతోపాటు సామాన్లను కూడా బయటకు విసిరేశారు. అనంతరం ఆమెను కట్టేసి ఇంటిని నేలమట్టం చేశారు. ఇంటి ఆనవాళ్లే లేకుండా ట్రాక్టర్‌తో చదును చేశారు. ఈ ఘటనలను తమ సెల్‌ఫోన్ ద్వారా ఫొటోలు, వీడియో తీయడానికి ప్రయత్నించి కొందరి ఫోన్లను లాక్కున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో బాధితురాలు తెలిసిన బంధువుల ఇంట్లో తలదాచుకుంది. ఇంత జరిగినా దీనిపై పోలీసులు స్పందించకపోవడంతో కూల్చివేతదారులకే పోలీసులు ఒత్తాసుగా నిలిచారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. విషయం తెలుసుకున్న కెవిపిఎస్ పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు.. బాధిత కుటుంబాన్ని ఫోన్ ద్వారా పరామర్శించారు. ఈ దారణంపై పోలీసులు కేసు నమోదు చేయాలని, నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి తాము అండగా ఉంటామన్నారు.

గొంతెండాల్సిందేనా?

(మొదటి పేజీ తరువాయి)

స్థాయిలో నీటి సరఫరా లేదు. చాలా గ్రామాలకు నిత్యం తాగునీరు సరఫరా కావడం లేదు. రెండు మూడు రోజులకు ఒకసారి, కొన్ని గ్రామాలకు అయితే వారానికి ఒక సారినీటి సరఫరా చేస్తున్నారు. ఎక్కువ మంది తాగునీటిని కొనుగోలు చేసి తాగడానికి అలవాటు పడటం వల్ల అధికారులపై వత్తిడి తగ్గిందనే వాదనలు విన్పిస్తున్నాయి. తాగునీటి ఎద్దడిపై చర్చించాలని ఈనెల 4న జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా సభ్యులకు సూచించారు. అయితే ఎక్కువ మంది స్పందించలేదు. పల్నాడు ప్రాంతానికి చెందిన జెడ్‌పిటిసిలు మాత్రం బోర్లు వేయడానికి అనుమతివ్వాలని కోరగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అంగీకరించారు. ప్రతిఏటా ఏప్రిల్‌లో ప్రణాళికలు రూపొందించడం, ప్రభుత్వం నిధుల మంజూరులో జాప్యం చేయడం, తీరా కొన్ని గ్రామాలకు ట్యాంకర్లతో నీటి సరఫరా చేయడం పరిపాటైంది. దీంతో నిధులు వచ్చే సరికి మళ్లీ వర్షాలు వస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి.

నటి రాజశ్రీకి ఎన్టీఆర్ శతాబ్ది చలనచిత్ర పురస్కారం

ఎన్టీఆర్ కుటుంబ సభ్యునిగా గర్విస్తున్నా: నందమూరి చైతన్య కృష్ణ

ప్రజాశక్తి-తెనాలి

శకపురుషుని శతజయంతి పేరిట మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారధ్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. స్థానిక నాజరుపేట ఎన్వీఆర్ కన్వెన్షన్‌లో ఆదివారం ఆలపాటి అధ్యక్షతన ఎన్టీఆర్ శతాబ్ది చలనచిత్రపురస్కార ప్రదానోత్సవం జరిగింది. అలనాటి నటి రాజశ్రీకి ఎన్టీఆర్ మనుమడు నందమూరి చైతన్య కృష్ణ చేతుల మీదుగా పురస్కారాన్ని అందజేశారు. అలాగే, షేక్ అష్రిఫ్‌ఆలికి ఎన్టీఆర్ అభిమాన పురస్కారాన్ని అందించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైతన్యకృష్ణ మాట్లాడుతూ ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనటం ఆనందంగా ఉందన్నారు. సినీ రంగంలో ఎన్టీఆర్ విభిన్న పాత్రలను పోషించి, ప్రజాభిమానాన్ని పొందారని, అలాగే రాజకీయాల్లోనూ నూతన ఒరవడిని సృష్టించారన్నారు. పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. మహోన్నతమైన వ్యక్తికి మహా ఘనంగా నిర్వహిస్తున్న ఉత్సవాలు అభినందనీయమన్నారు.

దర్శకులు బి.గోపాల్ మాట్లాడుతూ ఎన్టీఆర్, రాజశ్రీ కలిసి గొప్ప చిత్రాల్లో నటించారన్నారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల రూపం ఎన్టీఆర్‌ది అని కొనియాడారు. పురస్కార గ్రహీత రాజశ్రీ మాట్లాడుతూ ఎన్టీఆర్ వ్యక్తిత్వం గొప్పదని, ఆయన నుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉందన్నారు. ఆయన గురించి వివరించాలంటే జీవితకాలం చాలదని తన అభిమానాన్ని చాటుకున్నారు. ఆయన పేరిట పురస్కారాన్ని అందుకోవటం ఆనందంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, బుర్రా సాయిమాధవ్ ప్రసంగించారు. ఉత్సవ కమిటీ సభ్యులు షేక్ జానిబాషా, టి.హరిప్రసాద్, జె.మహేష్, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



రాజశ్రీని సత్కరిస్తున్న చైతన్యకృష్ణ, ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు



నిందితుడు అరెస్టు

మూడు లక్షల విలువ గల సొమ్ము స్వాధీనం

ప్రజాశక్తి-ఫిరంగిపురం

బస్సులో చోరీకి పాల్పడ్డ నిందితుడిని అరెస్టు చేసి మూడు లక్షల రూపాయల సొమ్ము స్వాధీనం చేసుకున్నట్లు ఫిరంగిపురం ఎస్ఐ ఎం.లక్ష్మీ నారాయణరెడ్డి, మేడికొండూరు సిఐ ఎండి కె.అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు. గుంటూరు జిల్లా ఎస్పీ కె. ఆరిఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు తుళ్లూరు డిఎస్పి వి.పోతురాజు ఆధ్వర్యంలో ఈ కేసు దర్యాప్తు చేసినట్లు తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. రెడ్డి రామకృష్ణ కృష్ణాజిల్లా మచిలీపట్నం టౌన్ కు చెందిన వ్యక్తి. చిన్నచిన్న వెండి వస్తువులన గ్రామాల్లో అమ్ముకుని జీవిస్తుంటాడు. ఈక్రమంలో మచిలీపట్నం నుండి గుంటూరుకు వెళ్లే శ్రీనివాసట్రావెల్స్ బస్సులో ఈ నెల పదో తేదీ రాత్రి 9 గంటలకు బస్సు ఎక్కాడు.విజయవాడకు వరకు టికెట్ తీసుకున్న అతను గుంటూరు బస్టాండ్‌లో తెల్లవారుజామున నాలుగు గంటలకు దిగాడు. ఇదే బస్సులో కూసం అలేఖ్య కూడా ప్రయాణిస్తోంది. కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూరుకు చెందిన అలేఖ్య హ్యాండ్‌బ్యాగ్‌లో బంగారు ఆభరణాలు ఉన్నాయి. అలేఖ్య నిద్రిస్తున్న సమయంలో ఆమె బ్యాగ్ చోరీకి గురైంది. గుంటూరులో బస్సు దిగే సమయంలో తన హ్యాండ్ బ్యాగ్ కనిపించలేదు. ఈక్రమంలో ఫిరంగిపురం పోలీసులకు ఆమె ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేసే క్రమంలో తమకు వచ్చిన సమాచారం మేరకు 11 వ తేదీ ఉదయం పది గంటలకు గుంటూరు మార్కెట్ దగ్గర నిందితుడిని అరెస్టు చేసి విచారించినట్లు చెప్పారు. మూడు లక్షల రూపాయలు విలువ గల 20 గ్రాములు బంగారు గాజులు, 10 గ్రాములు బంగారు లక్ష్మీదేవి ఉంగరం, 8 గ్రాముల నల్లపూసల దండ, రూ.20,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితుడిని కోర్టుకు హాజరు పరచనున్నట్లు చెప్పారు.



గ్రామ సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-రొంపిచర్ల

రాష్ట్రంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వం లక్ష్యమని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టరు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని మాచవరంలో ఆదివారం గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పర్యటించారు. గ్రామానికి విచ్చేసిన వారికి వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఆ గ్రామంలో రూ.40 లక్షల తో నిర్మించిన గ్రామ సచివాలయము, రూ.20 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. అదే విధంగా ఆ గ్రామంలో వైసిపి నాయకులు బొబ్బిలి కోటిరెడ్డి కుమారుడి వివాహ వేడుకలలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదిం చారు. ఈ సందర్భంగా గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మాచవరంలో ఇప్పటి వరకు రూ.14 కోట్లతో అబివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు చెప్పారు. కార్య క్రమంలో జడ్‌పిటిసి పిల్లి ఓబుల్ రెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, ఆర్ఐ సుబ్బారావు, పిజెబిఆర్ చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ పడాల శివారెడ్డి, వైసిపి మండల నాయకులు కేసరి వెంకటేశ్వరరెడ్డి, చపారపు సంజీవరెడ్డి, అన్నెం పున్నారెడ్డి, గెల్లి సుబ్బారెడ్డి, బత్తుల రామకృష్ణ, కాటం శ్రీనివాసరావు, జి.బాలిరెడ్డి,ఇర్ల వెంకటరత్నం వివిధ శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్ట్రేలియాలోని వర్శిటీలో ప్రభాస్‌కు ఎంబిబిఎస్ సీటు

ప్రజాశక్తి-తెనాలి


ప్రభాస్‌ను అభినందిస్తున్న కుటుంబ సభ్యులు, ప్రముఖులు

పట్టణానికి చెందిన గ్రంధి శ్రీమన్నారాయణ, సుజాత దంపతుల కుమారుడు గ్రంధి ప్రభాస్ ఆస్ట్రేలియాలోని మోనాష్ యూనివర్సిటీలో ఎంబిబిఎస్‌లో సీటు సాధించాడు. పట్టణానికి చెందన ఈ కుటుంబం కొంత కాలం క్రితం ఆస్ట్రేలియాలో స్థిర పడింది. ప్రభాస్ తండ్రి శ్రీమన్నారాయణ ఆస్ట్రేలియా సెంట్రల్ క్వీన్స్ ల్యాండ్‌లో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు. అక్కడే చదువుతున్న ప్రభాస్ ఇంటర్‌లో (12 స్టాం డర్డ్)లో 99.35 శాతం మార్కులు, అలాగే మెడిసిన్ ఎంట్రన్స్‌లో 99శాతం మార్కు లు సాధించాడు. మొత్తం ఎనిమిది మెడికల్ కళాశాలల్లో సీటు లభించిందని, అయి తే ఇంటిగ్రేటెడ్ మెడిసిన్ అంటే ఎంబిబిఎస్, ఎంఎస్ ఐదు సంవత్సరాల్లో పూర్తి చేసే విధంగా కోర్సును అందిస్తున్న మోనాష్ యూనివర్సిలో ప్రభాస్ చేరాడు. ఇటీవల తెనాలి వచ్చిన ప్రభాస్, తన తాతయ్య గ్రంధి సేతుమాధవరావు ఇంట్లో ఆత్మీయ సమావేశంలో పాల్గొనగా అతన్ని కుటుంబ సభ్యులు అభినందించారు.



సత్రశాలలో ఎడ్ల బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - రెంటచింతల

మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని సత్రశాలలో భక్త మల్లారెడ్డి అన్నదాన సత్రంలో ఆదివారం రెండు పళ్ల విభాగంలో ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహించారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడుకు చెందిన అంజయ్య చౌదరి ఎడ్ల జత 4437.4 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలవగా కృష్ణాజిల్లా జొన్నలగడ్డ దేవతారావు ఎడ్లజత 4372.8 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచింది. తెలంగాణలోని ఖమ్మం జిల్లా కామేపల్లికి చెందిన రామిరెడ్డి దామోదర్‌రెడ్డి, మాచవరం మండలం పిన్నెల్లికి చెందిన కంబైన్డ్ ఎడ్లజత 4178.3 అడుగుల దూరం లాగి తృతీయ స్థానంలో నిలిచింది. గుంటూరు జిల్లా ప్రత్తిపాడుకు చెందిన కల్లూరు ప్రసాద్ ఎడ్ల జత 4087 అడుగులతో నాలుగో స్థానంలో, ప్రత్తిపాడు మండలం పాత మల్లయ్య పాలేనికి చెందిన ఎడ్ల జత 4051.9 అడుగులతో ఐదో స్థానంలో, తోటపాలేనికి చెందిన రత్తయ్య చౌదరి ఎడ్లజత 3600 లాగి ఆరో స్థానంలో నిలిచాయి. పోటీలను చూడటానికి చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో వచ్చారు.



పోలీస్‌స్టేషన్‌లో సంతకం పెట్టి వెళ్తున్న జూలకంటి బ్రహ్మారెడ్డి

పోలీస్‌స్టేషన్‌కు బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో సంతకాలు పెట్టేందుకు ఆదివారం తన అనుచరులతో కలిసి మాచర్లకు వచ్చారు. ఆయన రాక సందర్భంగా అభిమానులు టిడిపి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో స్టేషన్ వద్దకు చేరుకున్నారు. గత డిసెంబర్ నెలలో మాచర్ల పట్టణంలో వైసిపి-టిడిపి గ్రూపుల ఘర్షణలో పలువురికి గాయాలుకావడం, టిడిపి కార్యాలయం, నాయకుల గృహాల ధ్వసం, పలు వాహనాలు దహనం జరిగిన సంగతి తెలిసిందే. ఆ ఘర్షణల్లో టిడిపి, వైసిపి నాయకులపై కేసు నమోదయ్యాయి. ఆ కేసుల్లో కండిషన్ బైల్‌పై ఉన్న బ్రహ్మారెడ్డి ప్రతి ఆదివారం మాచర్లకు వచ్చి పోలీస్‌స్టేషన్లో సంతకాలు చేసి మళ్లీ గుంటూరుకు వెళ్తున్నారు.

గురుకులంలో తల్లిదండ్రుల సమావేశం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : గురుకుల పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించామని, తల్లిదండ్రులు తమ పిల్లల్ని గురుకులానికి పంపించాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కెవి స్వర్ణకుమారి కోరారు. రామకృష్ణాపురం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఆదివారం నిర్వ హించారు. వారు లేవనెత్తిన పలు అంశాలను, సందేశాలను నివృత్తి చేశారు. విద్యార్థినులు ఆరోగ్యం పరిర క్షణకు అన్నిరకాల చర్యలూ తీసుకున్నామని వివరించారు.





గండిగనుమలలో బోరు మోటారు ట్యాంక్ వద్ద నీటి కోసం బిందెలతో స్థానికుల నిరీక్షణ

ప్రభుత్వాలు ఎన్ని మారినా బొల్లాపల్లి మండల ప్రజల గొంతు వేసవిలో ఎండకుండా చూడలేకపోతున్నారు. పంచాయతీ నుండి అసెంబ్లీ ఎన్నికల వరకూ ప్రతి నాయకునికీ ఓట్లు అడగడానికి తాగునీటి అంశమే ప్రధాన సమస్య అవుతోంది. గెలిచాక నిధులు కేటాయిస్తున్నట్లు అధినాయకత్వం ద్వారా ప్రకటనలు ఇప్పిస్తున్నా అవన్నీ నీటి మీద రాతలవుతున్నాయి.

ఏళ్లు గడుస్తున్నా నీళ్ల గండమే

- అడుగంటిన భూగర్భ జలాలు
- రూ.లక్ష పెట్టి బోరు వేస్తున్నా దక్కని చుక్కనీరు
- బిల్లులందక నిలిచిన ట్యాంకర్ల సరఫరా
- కూలి పనులు మానకుని బిందెలతో కిలోమీటర్ల నడక
- కార్యరూపం దాల్చని నాయకుల హామీల వరద
- బొల్లాపల్లి మండలంలో తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి - వినుకొండ

బొల్లాపల్లి మండలంలోని గండిగనుమల, రేమిడిచర్ల, చక్రాయపాలెం, మేకలదీన్నే, దోమలగుండం, గరికపాడు, హనుమాపురం, లాలిపురం, తదితర గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. వేసవి వస్తుందంటే గొంతు ఎలా తడుపుకోవాలనే భయం ఆయా గ్రామాల ప్రజలను వెంటాడుతోంది.ప్రతి వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి బోర్లకు నీరందక కిలోమీటర్ల దూరంలో వ్యవసాయ బోర్ల నుండి తాగునీటిని బిందెలతో మోసుకు రావాల్సి వస్తోంది. గండిగనుమల, దోమలగుండం తదిత గ్రామాల్లోని వారు తమ ఇంట్లోకి బిందెడు నీరు కావాలంటే ఇంట్లో ఎవరో ఒకరూ కూలి పనులు మానుకోవాల్సిందే. కిలో మీటర్లపాటు కాలి నడకనో, వాహనం మీదో వెళ్లి వ్యవసాయ బోర్ల వద్ద నీరు పట్టుకుని రావాల్సి వస్తోంది. మరోవైపు తాగునీటి సరఫరా సాకుతో అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు పంచాయతీ, మండల పరిషత్ నిధులను కాజేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న గ్రామాలకు రెండళ్ల కిందటి వరకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేవారు. అయితే గతేడాది బిల్లులను నిలిపేయడంతో ఆ సరఫరా కూడా నిలిచింది. అయితే అన్ని గ్రామాల్లో బోర్లు వేయించి నీటిని సరఫరా చేస్తున్నట్లు ఒ నాయకుడు అధికారులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులకు తప్పుడు సమాచారం ఇస్తున్నాడని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను వారు పరిశీలించడం లేదనే విమర్శలూ ఉన్నాయి.

రైతు రూ.లక్ష పెట్టినా చుక్కనీరు లేదు..!

మండలంలోని చక్రాయపాలెంలో ఒకవైపు తాగునీటి కష్టాలు వేధిస్తుంటే మరోవైపు భూగర్భ జలాలు అడుగంటి చేతికంది వచ్చిన మిర్చిని బతికించుకోవడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. సంక్రాంతి తర్వాత ఇటీవల ఈ గ్రామంలో రైతులు 40 బోర్లు 1000-1200 అడుగులు వేస్తే ఆరు బోర్లు మినహా మిగతావేవీ ఫలించలేదు. ఒక్కో బోరుకు రూ.లక్ష వరకు రైతులు ఖర్చు చేసినా చుక్కనీరు దక్కక అల్లాడుతున్నారు. హనుమాపురం తండా లోనూ ఇటీవల 30 బోర్లు వేస్తే నాలుగు బోర్లలోనే నీరు పడింది. లాలిపురం, గరికపాడు గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి.

సిఎం నోట.. నాటి ఎమ్మెల్యే మాట..

ఎన్నికల నాటి హామీ అయిన వరికెపూడిసెల ప్రాజెక్టు నిర్మాణం ముందుకు కదల్లేదు. దీంతో సాగునీరు అలా ఉంచి కనీసం తాగునీటి సమస్యా నాలుగేళ్లుగా తీరడం లేదు. బొల్లాపల్లి చెరువును రెండేళ్ల కిందట పరిశీలించిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు సమీపంలోని నాగార్జున సాగర్ కుడి కాల్వ మూగచింతలపాలెం డీప్ కట్ నుండి పైపులైను ఏర్పాటు చేస్తామనే హామీ కార్యరూపం దాల్చలేదు. ఇదే హామీని ఇటీవల వినుకొండకు వచ్చిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ఇచ్చారు. 20 ఏళ్ల క్రితం అప్పటి టిడిపి ప్రభుత్వం బొల్లాపల్లి సమీపంలోని చప్పిడి వాగుపై చెరువుకు అలుగు నిర్మించి అభివృద్ధి చేసేందుకు మైనర్ ఇరిగేషన్ శాఖకు అంచనాలతో బదిలీ చేసింది. అదికూడా నెరవేరలేదు.



చక్రాయపాలెంలో నిరుపయోగంగా ఉన్న బోరు మోటారు ట్యాంక్

తాగునీటి సరఫరా కోసం రూ.220 కోట్లు

- రానున్న వందేళ్ల అవసరాలకు అనుగుణంగా పథకాలు మంజూరు
- ప్రతి ఇంటికీ కుళాయి, కృష్ణా నది నీరు
- గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

గురజాల నియోజకవర్గంలో ఇంటింటికీ తాగునీరు అందించేందుకు జల్ జీవన్ మిషన్ పథకం కింద రూ.220 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. పిడుగురాళ్లకు ఆదివారం వచ్చిన ఆయన స్థానిక ఆర్ అండ్ బి బంగ్లాలో వైసిపి నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. 1995 నుండి అధికారంలో ఉన్న నాయకులెవ్వరూ నియోజకవర్గంలో తాగునీటి సదుపాయం కల్పించలేకపోయారని అన్నారు. పల్నాడు జిల్లాలో మెట్ట మెదటగా మాచవరం మండలం తురకపాలెంలో ఇంటింటికీ నీరు అందిచబోతున్నామని, పైప్‌లైన్ వేయడం పూర్తయిందని చెప్పారు. త్వరలో ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. పిడుగురాళ్ల పట్టణంలో 5 వేలకు పైగా ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేశామని, వచ్చే సంవత్సరం నాటికి 10 వేల ఇళ్లకు పూర్తి చేస్తామని వివరించారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి నిధులు మంజూరయ్యాయని, పిడుగురాళ్ల మున్సిపాల్టీకి రూ.120 కోట్లు, దాచేపల్లి మున్సిపాల్టీకి రూ.16.50 కోట్లు, గురజాల మున్సిపాల్టీకి రూ.8.50 కోట్లు, గురజాల నియోజకవర్గంలోని 57 గ్రామాలకు రూ.72 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని రానున్న వందేళ్లకు సరిపడా తాగునీటి పథకాలను మంజూరు చేశామని అన్నారు. రానున్న రెండేళ్లలో నియోజకవర్గం లోని ప్రతి ఇంటికి కుళాయిలు బిగించి కృష్ణానది నుండి నేరుగా తాగునీరు సరఫరా చేస్తామని చెప్పారు.



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

ప్రజాశక్తి
గుంటూరు 5
సోమవారం 13 ఫిబ్రవరి 2023

సాహిత్య, సాంస్కృతిక రంగాలపై బిజెపి దాడి

- ప్రతిఘటించే చైతన్యం ప్రజల్లో తేవాలి
- అరసం రాష్ట్ర మహాసభ ముగింపు సభలో వక్తలు
- కథాస్రవంతి సభలో ఎనిమిది కథా సంపుటాలు ఆవిష్కరణ


అరసం రాష్ట్ర నూతన కమిటీ

ప్రజాశక్తి-తెనాలి

అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. రెండు రోజులపాటు నిర్వహించిన సభల్లో పలువురు అరసం జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు. స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో చివరిరోజున అభ్యుదయ సాహితీ వేత్త ముత్యాల ప్రసాద్ సాహిత్య వేదికపై జరిగిన సభకు అరసం రాష్ట్ర కార్యదర్శి కె.శరశ్చంద్ర జ్యోతిశ్రీ అధ్యక్షత వహించారు. సభలో 'ప్రగతిశీల సాహిత్య సాంస్కృతిక శక్తులపై దాడులు-కర్తవ్యాలు' అంశంపై అరసం అఖిలభారత కార్యదర్శి వినీత్ తివారి ప్రసంగించారు. విప్లవ రచయితల సంఘం నాయకులు సిఎస్‌ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ హిందూత్వ భావజాల ఆధిపత్యాన్ని ప్రజలపై బలవంతంగా రుద్దే ప్రయత్నంలో ప్రభుత్వాలు న్నాయన్నారు. భారతీయ సమాజాన్ని హైందవీకరణ చేసే దిశగా బిజేపి, ఆర్‌ఎస్‌ఎస్ కుట్ర పన్నాయన్నారు. మనువాద అభిప్రాయాలను బలంగా ప్రజల్లో చొప్పిస్తున్నారన్నారు. రాజ్యాంగం, న్యాయ వ్యవస్థ కూడా సామాన్యులకు న్యాయం చేసే పరిస్థితిలో లేదని, బిజేపి నేతగా పనిచేసిన ఓ వ్యక్తిని సుప్రీం కోర్టు కొలీజియం అత్యున్నత న్యాయస్థానంలో న్యాయమూర్తిగా సమర్థించిందంటే పరిస్థితి ఎంత దిగజారిపోయిందో అర్ధచేసుకోవాలన్నారు. ఈ పరిణామాలను పరిశీలిస్తే సాహిత్య, సాంస్కృతిక రంగంపై దాడులు ఉద్దేశపూర్వకంగా, పథకం ప్రకారం జరుగుతన్నవేనని గుర్తించి వాటిని ప్రతిఘటించే చైతన్యం ప్రజల్లో తేవాలన్నారు. ప్రజానాట్యమండలి ప్రకాశం జిల్లా అధ్యక్షులు చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ అభ్యుదయ రచయితల కలం, ప్రజానాట్యమండలి గళం రెండూ ఏకం కావాలని, తద్వారా ప్రజా చైతన్యానికి నాంది పలకాలన్నారు. మహాసభల్లో అరసం భవిష్యత్ కార్యాచరణను దృష్టిలో ఉంచుకుని పలు తీర్మానాలను ప్రవేశపెట్టారు.

కథా స్రవంతి ఆవిష్కరణ సభ

మహాసభను పురస్కరించుకుని కథా స్రవంతి ఆవిష్కరణ సభకు ప్రధాన సంపాదకులు వల్లూరు శివప్రసాద్ అధ్యక్షత వహించి ప్రసంగించారు. కథా స్రవంతి పేరిట ఇప్పటికే 43 కథా సంపుటాలను ఆవిష్కరించినట్లుచెప్పారు. అరసం రాష్ట్ర మహా సభల్లో మరో ఎనిమిది సంపుటాలను ఆవిష్కరించామన్నారు. వాటిలో సభాకథలు, వాసిరెడ్డి సీతాదేవి కథలు, జాతశ్రీ కథలు, షేక్ హుస్సేన్ సత్యాగ్ని కథలు, తల్లావఝుల పతంజలి శాస్త్రి కథలు, కుప్పిలి పద్మ కథలు, డాక్టర్ నక్కా విజయరామారావు కథలు, డాక్టర్ ఎం.హరికిషన్ కథలున్నాయన్నారు. అరసం అధ్యక్షులు రాచపాలెం చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ ఎం.హరికిషన్ కథలకు ఆయన సంపాదకులుగా వ్యవహరించినట్లు చెప్పారు. ఆయన కథల్లో రాయలసీమ కరవు, ఆ ప్రాంతంలో ఫ్యాక్షనిజం, విద్యా వ్యవస్థలో ప్రమాదకరంగా మారిన సంస్కరణలు ప్రధానంగా ఉన్నాయన్నారు. తెలుగు కథలు సమాజానికి మార్గదర్శకంగా ఉన్నాయంటే అతిశయోక్తి కాదన్నారు. అరసం జాతీయ సమితి కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కథా సంకలనాల నిర్మాణానికి అరసం కృషి చేస్తోందన్నారు. తెలుగు కథ ద్వారా సమాజానికి మేలు చేసే కథలను ఎంపిక చేసి ప్రచురించినట్లు చెప్పారు. జాతశ్రీ కథల సంపాదకులు కేపి కిషోర్‌కుమార్ మాట్లాడుతు కథాస్రవంతి పుస్తకాలు ఎంతో విలువైన సాహిత్యంతో కూడుకున్నవన్నారు. భట్టిప్రోలు కథల రచయిత డాక్టర్ నక్కా విజయ రామరాజు మాట్లాడుతూ తన కథలకు తన స్వీయ అనుభవాలే ముడిసరుకుగా చెప్పారు. బాలసాహితీ వేత్త డాక్టర్ ఎం.హరికిషన్ పిల్లల మానసిక స్థాయికి తగిన విధంగా కథలుండాలన్నారు. ఈ సదర్భంగా పలు పుస్తకాలను అరసం బృందం ఆవిష్కరించారు. సమావేశంలో బిఎన్ సాగర్, ఏఎంఆర్ ఆనంద్, ప్రముఖ బాలసాహితీవేత్త షేక్ అబ్దుల్ హకీంజాని తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఎస్‌ఆర్ ప్రసాద్


మాట్లాడుతున్న రాచపాలెం చంద్రశేఖర్




మాట్లాడుతున్న వి శ్రీనివాస ప్రసాద్

కెఎల్‌పిలో రాష్ట్రస్థాయి క్విజ్‌బి పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు :స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో ఆదివారం రాష్ట్ర స్థాయి క్విజ్‌బి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రదేశాల నుండి 22 పాఠశాలలు పాల్గొన్నాయి. పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ వై.రధినీచౌదరి జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఇలాంటి కార్యక్రమా లు విద్యార్థుల మేధాశక్తిని, ఏకాగ్రతను, ధారణను పెంపొందిం చటానికి దోహదం చేస్తాయన్నారు. క్విజ్ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ ఇ.కోటేశ్వరరావు, జెకెసి కాలేజి అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.నాగసుశీల వ్యవహరించారు. స్రీనింగ్ అనంతరం నిర్వహించిన ఫైనల్స్‌లో ఆరు పాఠశాలలు పోటీ పడ్డాయి. ఫైనల్స్‌లో డాక్టర్ కెఎల్‌పి స్కూల్, భవ్య సిమెంట్ డిఎవి స్కూల్, వెంకటేశ్వరా బాలకుటీర్ మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. విజేతలకు వరుసుగా రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు నగదు బహుమతి, జ్ఞాపికలను అందజేశారు.



గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న కృష్ణప్రసాద్, తదితరులు


మాట్లాడుతున్న డాక్టర్ బ్రహ్మారెడ్డి

విద్యార్థులు ఆచరించేలా బోధన ఉండాలి

అజ్ఞానాంధకారంలోకి నెడుతున్న పాలకులు

రెండవరోజు నాస్తిక మేళాలో వక్తలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలంలోని నిడమర్రులో ఉన్న చార్వాక ఆశ్రమంలో నాస్తిక సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 31వ రాష్ట్రస్థాయి నాస్తిక మేళా ఆదివారమూ కొనసాగింది. రెండోరోజు మేళాలో భాగంగా మొదటి సెషన్‌లో ఖగోళ విజ్ఞానం అనే అంశంపై డాక్టర్ శ్రీరఘు నందన్ కుమార్ మాట్లాడారు. పెరుగుతున్న ఖగోళ విజ్ఞానం ఆధారంగా ప్రపంచంలోని అనేక దేశాలు అభివృద్ధి చెందుతుంటే భారత పాలకులు మాత్రం ఉన్నత విద్యాలయాల్లో జ్యోతిష్యం, భూత వైద్యం పై కోర్సులు పెట్టి విద్యార్థులను, ప్రజలను అజ్ఞానాంధకారంలోకి నెడుతున్నారని విమర్శిం చారు. 13 రాసులున్నట్లు ఇంటర్నేషనల్ ఆస్ట్రానమి యూనియన్ ప్రకటించినా జ్యోతిష్యులు 12 రాసులతోనే కాలం గడుపుతున్నారని ఎద్దేవ చేశారు. మార్చి 28న చంద్రగ్రహణం ఉందని, అయితే దానివల్ల ఎవరికీ నష్టం లేదనే విషయాన్ని నాస్తికులు ప్రచారం చేయాలని కోరారు. అనంతరం 'తరగతి గదిలో విద్యార్థులకు శాస్త్రీయ దృష్టిని కలిగించేది ఎలా?' అనే అంశంపై జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు బ్రహ్మారెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు సైన్స్ జ్ఞానం చెబుతున్నారు గాని విద్యార్థులు జీవితాన్ని ఆచరించే విధంగా బోధన ఉండాలన్నారు. ఉపాధ్యాయులు శాస్త్రీయ జ్ఞానం కలిగి ఉండాలని చెప్పారు. శీతల పానియాల వల్ల మనిషి శరీరానికి జరిగే నష్టాలను వివరించాలన్నారు. అయితే శీతల పానియాల వ్యాపారం ద్వారా వచ్చిన లాభాలతో అమెరికా తుపాకులు, బాంబులు తయారు చేసి ప్రపంచంలో దేశాల మధ్య గొడవలు సృష్టిస్తోందని వివరిం చారు. శాస్త్రీయ దృక్పథం ఉన్న ఉపాధ్యాయులు తరగతులు బోధించడం వల్ల క్యూబా, ఫిన్లాండ్ దేశాల వారు నోబెల్ బహుమతి గ్రహీతలుగా ఉంటే మన దేశం వాటికి దూరంగా ఉన్నాయని చెప్పారు. దేవుడు ఉన్నాడని నిరూపిస్తే రూ.4 కోట్లు ప్రైజ్ ప్రకటించినా ఎవరూ నిరూపించలేదని, దేవుని పేరుతో వ్యాపారాన్ని పాలకులు పోషిస్తున్నారని విమర్శించారు. అనంతరం బి.రామకృష్ణ రచనలు-2 పుస్తకాన్ని డాక్టర్ టి.రాజా రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ భాను ప్రసాద్, సిహెచ్.జనార్ధన్, చలపతిరావు, ఎ.సాయికుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ శ్రీరఘునందన్ కుమార్

సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులు

'గడపగడపకు' వచ్చిన విజ్ఞాపనలకు ప్రాధాన్యం

ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల కేటాయింపు

ప్రజాశక్తితో సిపిఒ శేషశ్రీ





ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా జిల్లాలోని 568 సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని జిల్లా ముఖ్య ప్రణాళిక శాఖ అధికారి పి.శేషశ్రీ వెల్లడించారు. ఒక్కో సచివాలయం పరిధిలో రూ.20 లక్షలు కేటాయించినట్టు వివరించారు. ఎమ్మెల్యేలు ప్రజల వద్దకు వెళ్లినప్పుడు వచ్చే సమస్యలు, విన్నపాలను పరిగణలోకి తీసుకుని అభివృద్ధి పనులకు ఆమోదం ఇస్తున్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వచ్చిన వినతులకు ప్రాధాన్యత ఇస్తున్నారని వెల్లడించారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వివరించారు.

568 సచివాలయాల పరిధిలో ఎన్ని పనులకు అనుమతి ఇచ్చారు. ఎన్ని పురోగతిలో ఉన్నాయి?

గుంటూరు జిల్లాలో ఇప్పటి వరకు 769 పనుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. వీటిల్లో 718 పనులకు అనుమతి ఇచ్చారు. మొత్తం పనులు ప్రారంభం అయ్యాయి. 548 పనులు పురోగతిలో ఉన్నాయి. 19 పనులు పూర్తయ్యాయి.

ఏయే పనులకు ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నారు?

ప్రజల నుంచి వచ్చిన విజ్ఞాపనల మేరకు డ్రైన్లు, రోడ్లు, తాగునీరు, విద్యుత్ సమస్యలపై ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆయా వార్డుల్లో అత్యవసర ప్రాతిపదికన చేయాల్సిన పనులపై ప్రజా ప్రతినిధులు దృష్టి సారిస్తున్నారు. అయితే గ్రామాలకు, పట్టణ ప్రాంతాలకు సమస్యలపై వ్యత్యాసం ఉంటోంది. ఒక్కో చోట ఒక్కో సమస్యకు ప్రాధాన్యత ఉంటుంది. తక్షణ పరిష్కారం కనుగొనేందుకు సచివాలయాల నిధులను ప్రజా ప్రతినిధులు వినియోగించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

ఏయే శాఖలకు ఎక్కువగా పనులు కేటాయించారు?

గ్రామీణనీటి పారుదల శాఖ, శానిటేషన్, పంచాయతీరాజ్, మునిసిపల్ పరిపాలన శాఖ, విద్యుత్ శాఖలకు సంబంధించి మొతం 718 పనులు కేటాయించారు. వీటిల్లో 442 పనులు ప్రారంభం అయ్యాయి. వీటి అంచనాల విలువ రూ.46.60 కోట్ల నిధులు కేటాయించారు.

నామినేషన్ పద్ధతిన పనులు జరుగుతున్నాయా?

నామినేషన్ పద్ధతిన 442 మంజూరు అయ్యాయి. టెండరు పద్ధతిలో 276 పనులకు అనుమతి ఇచ్చారు. నామినేషన్ పద్ధతిన కేటాయించిన 442 పనుల్లో 327 పురోగతిలో ఉండగా టెండరు ప్రాతిపదికన చేపట్టిన పనుల్లో 221 పురోగతిలో ఉన్నాయి. రూ.5 లక్షల వరకు నామినేషన్ల ప్రాతిపదికన పనుల కేటాయింపునకు ప్రభుత్వం అంగీకరించింది.

భూ కమతాల సర్వేలో పురోగతి ఉందా?

జిల్లాలో మొత్తం 7,14, 427 కమతాలు ఉన్నట్టు రెవెన్యూ రికార్డులల్లో స్పష్టమైంది. వీటిల్లోఇప్పటి వరకు 6,49, 399 కమతాలపై సర్వే వివరాలు నమోదు చేశాం. ఇంకా పున: పరిశీలన చేయాల్సి ఉంది. సర్వే పురోగతిలో ఉంది. ఈ సర్వే ద్వారా భూ యజమానులు వివరాలన్నీ నమోదు చేస్తున్నారు.



వినుకొండలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - వినుకొండ

మహాత్మా గాంధీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో స్థానిక మహాత్మా గాంధీ హాస్పిటల్ వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రారంభించారు. పల్నాడు జిల్లాలో మహాత్మాగాంధీ హాస్పి టల్ సేవలు మరువలేనివని, అన్ని విభాగాల వైద్యులతో మెరుగైన వైద్య సేవలు అందిస్తోందని అన్నారు. గుండె వైద్య నిపుణులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైద్య శిబిరానికి 350 మంది హాజరయ్యారని, వారికి బిపి, షుగర్, ఇసిజి పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు అందజేసినట్లు చెప్పారు. శిబిరానికి హాజరైన రోగుల్లో అధికశాతం మందికి బిపి, షుగర్ ఉన్నట్లు చెప్పారు. ఎప్పటి కప్పుడు పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు పాటిస్తే గుండెపోటు, పక్షవాతం, మూత్రపిండవ్యాధులు తగ్గించుకోవచ్చని సూచించారు. డాక్టర్ శ్రీకాంత్, గాయత్రి, నవీన్ లు వైద్య సేవలు అందించారు. ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, ప్రముఖ వైద్యులు చిన్నపరెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



నిరుపేదలకు బియ్యం పంపిణీ

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక జివి మాధవరావు కార్యాలయంలో నిరుపేద బ్రాహ్మణులకు బియ్యం పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. దాతలు రఘు, రాజు సత్యనారాయణ, ఎన్.రామ్మోహన చార్యులు, ఎ.నాగేశ్వరరావు, పి.వరలక్ష్మమ్మ కుమారుడు మురళికృష్ణ, పి.నారాయణరావు సహకారంతో బియ్యం పంపిణి చేశారు. అనంతరం ఎక్కువ సార్లు, పేదలను ఆదుకొన్న దాత చింతలపూడి రాజగోపాలరావును దుశ్శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఎం.సత్యనారాయణ, ఎం.సుబ్రహ్మణ్యం, ఎంవి శర్మ, ఎస్ఎస్ మల్లిఖార్జున శాస్త్రి, బి.రవి కుమార్, సిహెచ్ భద్రయ్య, ఎం.మురళి, ఎం.వెంకటేశ్వర రావు, డి.నాగేశ్వరావు హాజరయ్యారు.



15న శ్రీ సంత్ సేవాలాల్ జయంతి

ప్రజాశక్తి - యడ్లపాడు

శ్రీ సంత్ సేవాలాల్ జయంతి కార్యక్రమం ఈ నెల 15న బోయపాలెంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు ఎపి గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం కరపత్రాలు పంపిణీ చేశారు. శ్రీనునాయక్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా రాజస్థాన్, హర్యానాల్లో కూడా సేవాలాల్ జయంతిని నిర్వహిస్తారని అన్నారు. సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఎస్టీ ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. పట్టణ గౌరవాధ్యక్షులు బి.చిన్ననాయక్, యడ్లపాడు మండల ఎస్టి నాయకులు వి.సూర్యనాయక్, ఎం.పాముల నాయక్, వి.లక్ష్మణ్ నాయక్, వి.వెంకటకృష్ణనాయక్, ఎం. గోపినాయక్, భూక్య శతిబాయి, ఆర్.శిరీషాబాయి పాల్గొన్నారు.

కోటప్పకొండకు వెళ్లే మార్గాల్లో
రోడ్డు విస్తరణ, మరమ్మతు పనుల పరిశీలన

ప్రజాశక్తి - నరసరావుపేట

కోటప్పకొండకు వెళ్లే మార్గాల్లో చేపట్టిన రోడ్డు విస్తరణ, మరమ్మతు పను లను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఆదివారం యలమంద వద్ద ఏర్పాటు చేసిన అప్రోచ్ రోడ్డును, కొండ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 14వ తేదీ నాటికి రహదారులు పూర్తికావాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మహాశివ రాత్రి సందర్భంగా ఈ నెల 18న నిర్వహించే తిరునాళ్ల ఏర్పాట్లకు సంబంధిత అధికారులతో సమీక్షించారు. కోటప్పకొండకు వచ్చే ప్రధాన రహదారులతో పాటు లింక్ రోడ్లను కూడా సిద్ధంగా ఉంచాలని చెప్పారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసేందుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున తిరునాళ్లకు వచ్చే యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యామ్నాయంగా అప్రోచ్ రోడ్డును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, కోటప్పకొండ-పమిడిమర్రు- జెఎన్టీయు కళాశాల మీదగా వినుకొండ రోడ్డు వరకు నూతనంగా నిర్మిస్తున్న రహదారి పనులను పరిశీలించారు. ప్రభలు కట్టే వాళ్ళు ఎవరూ భయపడొద్దని, కావాలంటే వాళ్ళందరూ రోడ్లను పరిశీలించాలని ఎమ్మెల్యే తెలియజేశారు. 14న మూడో సమీక్షా సమావేశం ఉంటుందని, ఆరోజున జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికారులతో అన్ని పనులను పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బి డిఇ రాజు నాయక్, ఎంపిపి ఎం.శ్రీనివాసరావు, జడ్పిటిసి చిట్టిబాబు, సర్పంచ్‌లు వి.నాగిరెడ్డి, డి.శ్రీనివాసరావు, రూరల్ సీఐ భక్తవత్సల రెడ్డి, ఎస్సై బాలనాగిరెడ్డి, సంబంధిత అధికారులు ,వైసిపి నాయకులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి



శివ స్వాములు మహా పాదయాత్రను ప్రారంభిస్తున్న మాచర్ల నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి

'యువగళం' విజయవంతం కోసం
చింతపల్లి నుండి శ్రీశైలం వరకు మహా పాదయాత్ర

ప్రజాశక్తి - కారెంపూడి

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర విజయవంతం కావాలని కోరుతూ చింతపల్లి గ్రామం నుండి శ్రీశైలం వరకు గ్రామ శివ స్వాములు మహా పాదయాత్రను ఆదివారం చేపట్టారు. మాచర్ల నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ చిరుమామిళ్ళ మధు బాబు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనను అంతమొందించేందుకు ప్రతి టిడిపి కార్యకర్త సిద్ధంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు యు. లక్ష్మీనారాయణ,కె.బాలకృష్ణ, జి.సురేష్ యాదవ్, మండల టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



'సంఘం'ఆధ్వర్యంలో గేదెలకు బీమా

ప్రజాశక్తి-రొంపిచర్ల

స్థానిక దాసరిపాలెం పాలఉత్పత్తిదారుల సహకార సంఘం కేంద్రంలో ఆదివారం సంగం డెయిరీ ఆధ్వర్యంలో గేదెలకు బీమా సౌకర్యం కార్యక్రమం జరిగింది. పాలఉత్పత్తిదారుల కేంద్రం పరిధిలోని 50 గేదెలకు బీమా సౌకర్యం కల్పించారు. గేదెలకు బీమాతో కలిగే ప్రయోజనాల గురించి సంగం డెయిరీ వైద్య సిబ్బంది రైతులకు వివరించారు. కార్యక్రమంలో పాలఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడు మన్నం లక్ష్మీనరసింహారావు, సెక్రటరీ సాగి రామారావు, టెస్టర్ జె.వి.కోటయ్య,పాలకవర్గసభ్యులు, పాలఉత్పత్తిదారులు, రైతులు పాల్గొన్నారు.

'ఫ్రెండ్స్ ఇన్ నీడ్' ఆధ్వర్యంలో
హెపటైటిస్ పరీక్షలు

ప్రజాశక్తి - రెంటచింతల

ప్రాణాంతక వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉం డాలని, రోగం వచ్చిన తర్వాత బాధ పడే కన్నా ముందు జాగ్రత్తలు తీసుకోవడమే మంచిదని మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రెంటచింతలలో ఫ్రెండ్స్ ఇన్ నీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హెపటైటిస్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. 67 మందికి పరీక్షలు చేయగా, వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు చెన్నారెడ్డి శ్యామల రవి కిషోర్ రెడ్డి ఉమామహేశ్వర్ రెడ్డి, మాచర్ల మున్సిపల్ చైర్మన్ బోయ రఘురాంరెడ్డి, శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

నల్లబజారులో పురుగు మందులు!

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట మండలం మొత్తంలో మిరప పైరును సుమారు 3 వేల హెక్టార్లు సాగు అయినట్లు ఉద్యాన వనశాఖాధికారుల లెక్కలు చెబుతున్నాయి. పంట కీలక దశలో ఉందని, తెగుళ్ల బారిన పడకుండా కాపాడు కుంటే మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని వ్యవసాయశాఖాధి కారులు చెబుతున్నారు. అయితే, నల్ల తామర తెగుళును తగ్గించి పూత, పిందె అధి కంగా వచ్చేందుకు ప్రముఖ కంపెనీ లకు సంబంధించిన బ్రోఫ్లా నిల్డే 300 జి/ఎల్ అనే 34 ఎంఎల్ మం దును అధిక శాతం రైతులు కొనుగోలు చేస్తున్నారు. దీనిని నెలకు రెండుసార్లు పిచికారి చేయాల్సి ఉంటుంది. ఈ పురుగు మందుకు డిమాండ్ పెరగడంతో, ఎక్కువ సొమ్ము చేసుకోవాలనుకున్న అక్రమార్కుల కార ణంగా ఇది నల్లబజారుకు చేరింది. బ్రోఫ్లా నిల్డే 34 ఎంఎల్ బాటిల్ ధర రూ.15 50. మొదట్లో ఇదే ధరకు విక్రయిం చారు. దీని డిమాండ్ పెరగ డంతో బ్లాక్‌లో దాదాపు రూ.3 వేలకు అమ్ముకుంటున్నారు. ఈ పురుగు మందు అవసరమైన రైతులు అడిగి నంత చెల్లించి కొనుగోలు చేయక తప్పట్లేదు.

గత ఏడాది నవంబర్‌లో కురిసిన వర్షాలకు పూత, పిందె రాలిపోవడం, మిరప పైరుకు నల్ల తామర రావడంతో రైతులు నిండా మునిగారు. నల్లతామర వల్ల పంటలో సగానికి తాలు కాయలు అవుతున్నాయని వాపోతున్నారు. తుఫానుల తీవ్రత, చీడ పీడలతో పంటలకు నష్టం వాటిల్లితే బీమా వర్తించదని బీమా కంపెనీ లతో పాటు ప్రభుత్వాధికారులు చేతులెత్తే యడం దారుణమని మిరప రైతులు అంటు న్నారు. కనీసం కొనుగోలు దారులతో ప్రభుత్వాధికారులు మాట్లాడి మంచి కాయల క్వింటాళ్ ధర రూ.18,000. ఇదే ధరను తాలు కాయలకు కూడా ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

ఆర్‌బికెల ద్వారా సరఫరా చేయాలి

రైతు మేరుగ వెంకటరామయ్య మాట్లాడుతూ ప్రస్తుతం రెండు ఎకరాల్లో మిరప సాగు చేస్తున్నాను. అదనంగా పిచికారి చేయాల్సి వస్తోందని, ఖర్చులు కూడా పెరుగుతున్నాయని, రెట్టింపు ఖర్చుతో పురుగు మందులు కొనాల్సి వస్తోందని చెప్పారు. అవసరమైన పురుగు మందులు నల్లబజారుకు వెళ్లిపోయాయని అన్నారు. ఉద్యాన వన శాఖాధికారులు ఆయా ప్రముఖ కంపెనీల పురుగు మందులు ఎంత కావాలో ఆలోచించి, ఆయా కంపెనీల ప్రతినిధులతో చర్చించి ఖచ్చితమైన ధరలకు రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బికెలు) ద్వారా సరఫరా అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.



పూత దశలో ఉన్న మిర్చి పైరు

ప్రభుత్వమే సబ్సిడిపై ఇవ్వాలి

మండల రైతు సంఘం నాయకులు బొళ్ల శంకరరావు మాట్లాడుతూ నల్లబజారులో విక్రయిస్తున్న ప్రముఖ కంపెనీల పురుగుమందులను ప్రభుత్వమే కొనుగోలు చేసి వాటిని ఆర్బీకేల ద్వారా పూర్తి స్థాయిలో సబ్సిడిపై రైతులకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు అడిగిన ఎరు వులపై పూర్తిస్థాయి సబ్బిడి ఇవ్వాలని కోరారు. గత ఏడాదిలో నష్టపోయిన మిరప రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాలూకాయలకు మంచికాయల ధరతో ప్రభు త్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

విలీన గ్రామాల కార్మికులు ఏం పాపం చేశారు...

రూ.21వేలు కనీస వేతనం అమలు చేయాలి : సిఐటియు

దశలవారీగా ఆందోళనకు కార్యాచరణ

ప్రజాశక్తి - మంగళగిరి

కార్పొరేషన్‌లో విలీనమైన 21 గ్రామాల శానిటేషన్ కార్మికులకు నెలకు వేతనం రూ.21వేలు అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ఎస్ చంగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మంగళగిరి సిఐటియు కార్యాలయంలో ఎంటిఎంసి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ విస్తృత సమావేశం యూనియన్ అధ్యక్షురాలు వెంగమ్మ అధ్యక్షత జరిగింది. సమావేశం లో చంగయ్య మాట్లాడుతూ కార్పొరేషన్ లో విలీనమైన పారిశుధ్య కార్మికులకు ప్రస్తుతం నెలకు రూ.12 వేల ఇస్తున్నారని ఇది అన్యాయమన్నారు. మంగళగిరి, తాడేపల్లి పట్టణాల్లో పనిచేసే వారికి నెలకు హెల్త్ అలవెన్స్‌తో కలుపుకొని రూ.21000 వేతనం ఇస్తున్నారని అన్నారు. విలీన గ్రామాల పారిశుధ్య కార్మికులు ఎం పాపం చేశారని వారికి ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కనీస వేతనం ఎంటిఎంసి కార్మికులతో సమానంగా విలీన గ్రామాల కార్మికులకు కూడా ఇవ్వాలని, లేకుంటే ఆందోళన చేస్తామన్నారు. అదేవిధంగా పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, చెప్పులు, సబ్బులు ఇవ్వాలని అన్నారు. మంగళగిరి తాడేపల్లి కార్మికుల పిఎఫ్ అకౌంట్లను సరిచేయాలని అన్నారు. రెండు నెలలుగా పెండింగ్లో ఉన్న హెల్త్ అలవెన్స్ వెంటనే ఇవ్వాలని కోరారు. ఎన్నికలకు ముందు కాంట్రాక్ట్ కార్మిక వ్యవస్థను రద్దుచేసి, పర్మినెంట్ చేస్తానని ముఖ్యమంత్రి హామీ ఇవ్వడం జరిగిందని, దాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాగా సమావేశంలో 21 గ్రామాల్లో యూనియన్ నాయకులు సందర్శించి కార్మికులను చైతన్యపరిచి, విలీన గ్రామాల కార్మికుల సమస్యలు పరిష్కరించుకోవడానికి సచివాలయాల వద్ద, పంచాయతీల వద్ద ధర్నా చేయాలని కార్యాచరణను సమావేశం నిర్ణయించింది. సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆర్ వేణు, యూనియన్ నాయకులు పి పూర్ణ, మంగయ్య తదితరులు పాల్గొన్నారు.



మంగళగిరిలో విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ ఎస్ చంగయ్య



కార్మికులతో మాట్లాడుతున్న కాకుమాను నాగేశ్వరరావు

భారీగా పెరిగిన రోడ్డు టాక్స్‌ను ఉపసంహరించాలి : సిఐటియు

15న గుంటూరులో జిల్లా సదస్సు జయప్రదం చేయాలని ప్రచారం

ప్రజాశక్తి - పెదనందిపాడు : భారీగా పెరిగిన రోడ్డు టాక్స్‌ను ఉపసంహరించు కోవాలని కోరుతూ ఈ 15 వ తేదీ బుధవారం గుంటూరు సి.ఐ.టి.యు.కార్యాలయంలో జరిగే జిల్లా సదస్సును జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు కాకుమాను నాగేశ్వరరావు కోరారు. ఆదివారం పెదనంది పాడు పాత బస్టాండ్ సెంటర్‌లో ఆటో డ్రైవర్స్ యూనియన్ సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే టోల్ టాక్స్‌లు, రోడ్ టాక్స్ లు, అధిక పెనాల్టీలు, గ్రీన్ టాక్స్ , మోటారు వాహన చట్ట సవరణ ఫైన్లతో బాడుగలు లేక కిస్తీలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటో మోటార్ కార్మికులను 15 సంవత్సరాలు దాటిన వాహనాలను తొలగించాలనడం చాలా దుర్మార్గమైన చర్య అన్నారు. కార్మికుల ఉపాధికి ఇబ్బందికరంగా ఉన్న చట్టాలను, నిబంధలను ఉపసంహరిం చుకోవాలని అన్నారు. సమావేశంలో పెదనందిపాడు మండల ఆటో స్టాండ్ డ్రైవర్స్ యూనియన్ గౌరవాధ్యక్షు లుగా కొత్తా వెంకట శివరావు, అధ్యక్షులు గా తెలగతోటి రామరాజు ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆటో స్టాండ్ అండ్ ఓనర్స్ యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులుగా బొనిగల సుబ్బారావు, రాజుపాలెపు పాపారావు, ఉపాధ్యక్షులుగా రాజుపాలెం సంసోన్, సహాయ కార్యదర్శిగా ఇనగల్లు బాజీలను కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

తిరుమవలన్‌కు తెనాలిలో ఘన స్వాగతం

ప్రజాశక్తి -తెనాలి



తమిళనాడులోని విద్యుతలై చిరుతైగల్ కచ్చి (విసికె) పార్టీ జాతీయ అధ్యక్షుడు తిరుమవలన్‌కు తెనాలిలో ఘనస్వాగతం లభించింది. గుంటూరులో జరగనున్న బిపి మండల్ కాంస్య విగ్రహావిష్కరణలో పాల్గొనేందుకు వస్తున్న ఆయన ఆదివారం తెల్లవారు జామున తెనాలి రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన ఒకటవ వార్డు కౌన్సిలర్ గెడ్డటి సురేంద్ర, పలువురు దళిత నాయకులు ఆయనను కలిసి స్వాగతించారు. అక్కడి నుంచి ఆయనను ర్యాలీగా గుంటూరు తీసుకువెళ్ళారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మట్లపూడి రాజేశ్వరరావు, వీసికె రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు

వాతావరణం ఉన్నట్టుండి మారుతూ ఉండటంతో, సీజనల్ వ్యాధులు కూడా అంతే వేగంగా వ్యాపిస్తున్నా యని వాటి పట్ల నిర్లక్ష్యం వీడి, వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని పల్మనాలజిస్ట్ డాక్టర్ వై.యస్.హిమజ అన్నారు. ఆదివారం అరండల్‌పేట అవగాహన కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై నిర్వహించిన ఆరోగ్య సభలో డాక్టర్ హిమజ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో చాలా మంది సీజనల్ జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వాలు అప్రమత్తమై సర్వేలు చేయిస్తున్నారన్నారు. దగ్గు, జలుబు, గొంతునొప్పి, జ్వరం, కడుపునొప్పి, వాంతులు, విరోచనాలు, శ్వాసకోశ సమస్యలు, తిన్న అన్నం జీర్ణం కాకపోవటం లాంటివి సీజనల్ వ్యాధులని తెలిపారు. వర్షాకాలం, చలికాలంలో ఇన్‌ఫ్లమంజా, మలేరియా, డెంగీ, టైపాయిడ్ జ్వరంతో పాటు, హెపటైటిస్ ఎ వ్యాధుల వల్ల ఎక్కువ హాని



మాట్లాడుతున్న డాక్టర్ హిమజ

ఉంటుందన్నారు. ఈ వ్యాధులు సోకటానికి ప్రధానంగా కలుషిత ఆహారం, అపరిశుభ్ర వాతావరణం, దోమలు అని వివరించారు. వికారం, వాంతులు విరోచనాలు వంటి లక్షణాలుంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించి, తగు చికిత్స పొందాలన్నారు. నివాస ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ హిమజను అవగాహన సభ్యులు సన్మానించారు.



సంక్షోభంలో భవన నిర్మాణ కార్మికులు

ఇసుక అమ్మి టిఎన్‌టియుసి నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి :రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారంటూ ఆదివారం సాయంత్రం మంగళగిరి పట్టణంలో టీఎన్టీయూసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. టిడిపి కార్యాలయం నుండి పాత బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి ఇసుకను కేజీ రూ.100 విక్రయిస్తున్నట్లుగా బోర్డు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిఎన్టియుసి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గోశాల రాఘవ, అధ్యక్షులు కే టి బి ప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం హయాంలో భవన నిర్మాణ రంగా కార్మికులు సంక్షోభంలో ఉన్నార న్నారు. టిడిపి హయాంలో ఉన్న సంక్షేమ పథకాలు రద్దు చేయడంతో కార్మికులు మరిన్ని ఇబ్బందు లు పడుతున్నారన్నారు. కార్యక్రమ ంలో నాయకులు టి వెంకటేశ్వరరావు, షేక్ రియాజ్, గోవాడ దుర్గారావు, కే అంకమ్మరావు, వాకా మాధవరావు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

సేవా కార్యక్రమాలు అభినందనీయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తెనాలి:వర్ధంతి, జయంతి కార్యక్రమాలను పురస్కరిం చుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించటం, పేదలకు అన్నదానం చేయటం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక ఆర్టీసి బస్టాండ్ వద్ద బాలాజి లాడ్జి ఆవరణలో ఆదివారం తుళ్ళూరు నరశింహారావు, ఆదిలక్ష్మమ్మ వర్ధంతి సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తొలుత వారి ఫోటోలకు నివాళు లర్పించి, అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, ట.శ్రీనివాసరావు, జగన్మోహనరావు, టి.ఉదయభాస్కరరావు, మాధవరావు, టి.వివేక్, టిఎస్ సుబ్బారాయుడు, జి.కోటేశ్వరారవు, జి.రాంగోపాల్, వీరంకి రంగారావు, వి.సుబ్బారావు, ఎస్.నాగేశ్వరరావు, ఎస్.కృష్ణ, జి.రవీంద్ర, ఎస్కె జాకీర్, ఎం.శ్రీనివాసరావు, ఆంజనేయులు, రెడ్డి, టి.సాంబశివ రావు పాల్గొన్నారు.



ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

స్థానిక పిఎఎస్ కళాశాల మరియు సోషల్ వర్కర్ రావి శివరామకష్ణయ్య సహకారంతో ఆదివారం గుంటూరు రమేష్ హాస్పటల్ వారు నిర్వహించిన ఉచిత వైద్య చికిత్స శిబిరంలో హాస్పిటల్ కి చెందిన పలువురు డాక్టర్లు పాల్గొని 312 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ల అవసరమైన వారికి మందులు రాసినప్పటికీ ఆసుపత్రి వారు ఉచితంగా ఇస్తున్నామని చెప్పిన అన్ని రకాల మందులు ఇవ్వలేకపోయారు ఈ విషయంలో పేషెంట్లు కొంతమంది అసంతప్తి వ్యక్తం చేశారు. కళాశాల ఎన్‌సిసి అధికారి పాతూరి శ్రీనివాస ఆధ్వర్యంలో ఎన్.సి.సి విద్యార్థులు పేషెంట్‌కి సహాయ సహకారాలు అందించారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బందితోపాటు కళాశాల ప్రిన్సిపల్ వీర రాఘవయ్య, రోటరీ క్లబ్ అధ్యక్షులు విక్టర్ జాన్ పాల్, జిల్లా నాయకులు పోపూరి లక్ష్మీనారాయణ, దాత రావి శివరామ కష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మాతృసేవా సంక్షేమ సంఘం వితరణ

ప్రజాశక్తి - మంగళగిరి



శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం గాలిగోపురం సెంటర్ వద్ద శ్రీపేద అనాథల మాత సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అన్న దానం చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు లింగినేని శ్రీరామమూర్తి, ఉపాధ్యక్షులు సాధారబోయిన నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన వెంకట నరసయ్య, కార్యదర్శి పేరం పూర్ణచంద్రరావు, కోశాధికారి యన్నం శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఖిద్మద్ టీమ్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మంగళగిరి



మంగళగిరి పట్టణంలో బాపనయ్య నగర్‌కు చెందిన పెద్దిరాజు- తిరుపతమ్మ దంపతుల కుమారుడు రంగ స్వామి (23) గత నెల న్నర క్రితం నల్లపాడు వద్ద జరిగిన రైలు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో వైద్యులు ఆపరేషన్ చేసి కుడికాలు తొలగించారు. కన్నుకు కూడా దెబ్బతగలడంతో చూపు సరిగా కనపడటం లేదు. రంగస్వామి తండ్రి రిక్షా కార్మికుడు, తల్లి పాచిపనులు చేసుకుంటుంది. ఈక్రమంలో రంగస్వామి వైద్యానికి కూడా మందులు లేకపోవడంతో ఖిద్మత్ టీం రూ.5వేలు సహాయం ఆదివారం అందజేసింది. కార్యక్రమంలో ఖిద్మత్ టీమ్ లీడర్ షఫీ, సభ్యులు మూసా, ఖాదర్ వారి, సులేమాన్, ఖాదర్ భాషా పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్కే పై టిడిపి ఆరోపణ తగదు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కే పై టిడిపి నాయకులు అవినీతి ఆరోపణ చేయడం తగదని వైసిపి మంగళగిరి పట్టణ అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు ఆదివారం వైసీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశం మాట్లాడుతూ తెలిపారు. మంగళగిరి నియోజకవర్గం లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్యే అభివద్ధి పనులు చేస్తున్నారని అన్నారు. కోనేటి అభివద్ధి పనులు ఎలాంటి అవినీతి జరగడం లేదని, టిడిపి నాయకులు వచ్చి పరిశీలించుకోవచ్చన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు ఎండి ఫిరోజ్, సంక బాలాజీ గుప్తా, ఆకురాతి రాజేష్, ఎం సుధారాణి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎం భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధికారికంగా సంజీవయ్య జయంతి నిర్వహించాలి

ప్రజాశక్తి - మంగళగిరి



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి ఉత్సవాలను తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రభుత్వాలు అధికారంగా నిర్వహించాలని ఏపీ మాలదాసు, మాల దాసరి, మిత్తల అయ్య వార్ల హక్కుల సాధన పోరాట సమితి నాయకులు కే దుర్గారావు అన్నారు. ఆదివారం మంగళగిరి అంబేద్కర్ సెంటర్లో సంజీవయ్య జయంతి ఉత్సవాలకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. అమరావతి రాజధానిలో సంజీవయ్య స్మృతి వనం కోసం రెండు ఎకరాల భూమిని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పోరాట సమితి నాయకులు కే కష్ణారావు, జి సాంబశివరావు, ఈ నరసింహారావు, ఈ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా కళ్ళజోళ్ళ పంపిణీ

ప్రజాశక్తి మంగళగిరి



పట్టణంలో గల రామనాథం చిన్న కోటయ్య శివ పార్వతమ్మ వద్ధుల సేవా ఆశ్రమంలో 93వ నేత్ర చికిత్స శిబిరం జరిగింది. ఇందులో అవసరమైన వారికి ఉచితంగా కళ్ళజోళ్లను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షులు ఆర్ వెంకటేశ్వరావు, ఆర్ సత్యనారాయణ, ఆర్ రమేష్ నాయుడు, డి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

భళా బాలోత్సవం

- రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్న విద్యార్థులు
- ఆకట్టుకున్న నృత్యం, కోలాటం

ప్రజాశక్తి - గుంటూరు

కిక్కిరిసిన సభా ప్రాంగణంలో జానపద నృత్యాలు, వెస్టన్ డ్యాన్స్, కోలాటం, శాస్త్రీయ నృత్యం వంటి ప్రదర్శనలతో, విద్యార్థుల కేరింతలు, ఆనందోత్సాహాల మధ్య బాలోత్సవం ఆదివారం ముగిసింది. జిల్లాలోని సుమారు వంద పాఠశాలల నుండి విద్యార్థినీ, విద్యార్థులు వేలాది మంది పాల్గొని రెండ్రోజులపాటు ప్రదర్శనలు ఇచ్చారు. పలువురు విద్యార్థులు ముగింపు సభలో మాట్లాడుతూ కొత్త స్నేహాలతో, మంచి అనుభావాలు మిగిల్చిన బాలోత్సవాన్ని వదిలి వెళ్లాలంటే బాధగా ఉందంటూ పలువురు విద్యార్థులు పేర్కొ న్నారు. రెండోరోజు కార్యక్రమంలో శాస్త్రీయ నృత్యం, జానపద, వెస్టన్ డ్యాన్స్, క్విజ్, వ్యాసరచన, కొల్లేజ్, కథ చెబు తాను, షార్ట్ ఫిలిమ్స్, కోలాటం పోటీలు జరిగా యి. గ్రూప్ డ్యాన్స్‌లు, కోలాటం, వ్యాసరచన పోటీలు ప్రత్యేక


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

ఆకర్షణగా నిలిచాయి. విజయవాడ ఆర్‌సిఎం స్కూల్, రెండో తరగతి విద్యార్థి చెర్రీ డ్రమ్స్ వాయించిన ప్రత్యేక ప్రదర్శన ఆకట్టుకుంది.


శాస్త్రీయ నృత్యంలో ప్రదర్శన ఇస్తున్న చిన్నారి


డ్రమ్స్ వాయిస్తున్న చెర్రీ


కోలాటం ప్రదర్శిస్తున్న విద్యార్థినులు


బాలోత్సవానికి తరలి వస్తున్న విద్యార్థినులు


మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు


ప్రదర్శనలు తిలకిస్తూ తల్లిదండ్రులు, విద్యార్థుల ఉత్సాహం


కొల్లేజ్‌లో బొమ్మలు తయారు చేస్తున్న విద్యార్థులు






వ్యాసరచనలో పాల్గొన్న విద్యార్థులు

ఆనందంగా గడిపాము



బాలోత్సవంలో ఎంతో ఆనందంగా గడిపాము. తమ స్కూల్లో ఉన్నట్టే రోజూ ఒక పండుగలాగా ఉంది. 2020లో కోవిడ్‌కు ముందు కూడా తాను పాల్గొని పేపర్ రీడింగ్ పోటీలో గెలిచాను. ఈసారి డ్యాన్స్‌లో పాల్గొన్నాను. కొత్త విషయాలు నేర్చుకున్నాను.

అమృత, ప్రొఫెసర్ ఎంవిఎస్ కోటేశ్వరరావు స్కూల్, గుంటూరు.

కొత్త విషయాలు తెలుసుకున్నాను



బాలోత్సవం చాలా బాగా నచ్చింది. క్విజ్‌లో పాల్గొని కొత్త విషయాలు తెలుసుకున్నారు. రాబోయే పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించటానికి క్విజ్ నాకు బాగా ఉపయోగడుతుందని అనుకుంటున్నా.

జి.శివకుమార్, ఈమని జెడ్పీ హైస్కూల్, దుగ్గిరాల మండలం.

స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవచ్చు



ఇలాంటి బాలోత్సవాల ద్వారా విద్యార్థుల్లో ఉన్న స్కిల్స్ అభివృద్ధి చేసుకోవచ్చు. చాలా రకాల పోటీలు నిర్వహించారు. ఇక్కడ ఎంతో మంది స్నేహితులయ్యారు. ఈ అనుభూతి ఎప్పటికీ మరువలేనిది. మా కోసం చేసిన ఏర్పాట్లు బాగున్నాయి.

యమున జెడ్పీ హైస్కూల్, గణపవరం, నాదెండ్ల మండలం.